మద్దిమేడారంలో భక్తుల కిటకిట

- మొక్కులు చెల్లించుకున్న భక్తులు
- తల్లులకు పట్టువస్త్రాలు సమర్పించిన ఆలయ కమిటీ చైర్మన్

నల్లబెల్లి: మండలంలోని నాగరాజుపల్లి మద్దిమేడారం జాతర భక్తులతో కిటకిటలాడింది. బుధవారం జాతర తొలిరోజు కావడంతో భక్తుల సంఖ్య క్రమక్రమంగా పెరుగుతోంది. తల్లుల ఆశీస్సుల కోసం ముల్లెమూటలతో కుటుంబసమేతంగా భక్తులు ఎడ్లబండ్లు, వాహనాల్లో బయలుదేరి జాతరకు చేరుకుంటున్నారు. తల్లుల గద్దెల వద్ద మొక్కులు చెల్లించుకొని ఎత్తు బంగారం (బెల్లం) సమర్పించుకున్నారు. పలువురు భక్తులు తలనీలాలు ఇచ్చి మొక్కులు చెల్లించుకున్నారు. తహసీల్దార్ రాజేష్, నర్సంపేట రూరల్ సీఐ శ్రీనివాస్, ఎంపీఓ కూచన ప్రకాశ్, మాజీ సర్పంచ్ గోనె శ్రీదేవిలతో కలిసి ఆలయ కమిటీ చైర్మన్ గాదె సుదర్శన్‌రెడ్డి కుటుంబ సభ్యులు తల్లులకు పట్టువస్త్రాలు సమర్పించేందుకు రాగా ఆలయ ప్రధాన పూజారి దురిశెట్టి సమ్మయ్య మంత్రోచ్ఛరణలు, డప్పువాయిద్యాలతో స్వాగతం పలికారు. తల్లులకు నూతన పట్టువస్త్రాలను సమర్పించి మొక్కులు చెల్లించారు.

నాలుగు సీసీ కెమెరాలు..30 మంది పోలీసులు

జాతరకు సుమారు మూడు లక్షల మంది భక్తులు హాజరు కానున్నట్లు అంచనా. జాతరలో పోలీస్ శాఖ కీలకంగా వ్యవహరించాలని భావిస్తుంది. నర్సంపేట ఏసీపీ కిరణ్ కుమార్ బుధవారం ఉదయం జాతరను సందర్శించి ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా బందోబస్తు చేపడుతామని చెప్పారు. ఎలాంటి ట్రాఫిక్ ఇబ్బందులు తలెత్తకుండా చూడాలని నర్సంపేట రూరల్ సీఐ శ్రీనివాస్, ఎస్సై నగేష్‌కు సూచించారు. అందుకనుగుణంగా సీఐ, ఇద్దరు ఎస్సైలు, ఏఎస్సై, నలుగురు హెడ్ కానిస్టేబుల్స్, 18 మంది కానిస్టేబుల్స్, నలుగురు హోంగార్డులకు విధులు అప్పగించి బందోబస్తు నిర్వహించేలా చర్యలు చేపట్టినట్లు పేర్కొన్నారు. అధికారులు, ఆలయ కమిటీ ప్రతినిధులు భక్తులకు ఎలాంటి అసౌకర్యాలు కలగకుండా నిరంతరం అప్రమత్తంగా ఉండాలని సూచించారు. అనంతరం స్థానిక పోలీస్‌స్టేషన్‌ను సందర్శించి రికార్డులను పరిశీలించారు.


తల్లులకు పట్టువస్త్రాలు తీసుకొస్తున్న సుదర్శన్‌రెడ్డి కుటుంబ సభ్యులు

వైద్య శిబిరాన్ని సందర్శించిన తహసీల్దార్

మద్దిమేడారంలో భక్తులకు వైద్యసేవలు అందించేందుకు మేడపల్లి పీహెచ్‌సీ సిబ్బంది జాతరలో వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేశారు. భక్తులకు అవసరమైన చికిత్స అందిస్తున్నారు. తహసీల్దార్ రాజేష్ వైద్య శిబిరాన్ని సందర్శించారు. శిబిరంలో అందిస్తున్న వైద్యసేవలను డాక్టర్ నవీన్‌కుమార్‌ను అడిగి తెలుసుకున్నారు.

టేకుల మేడారంలో..

మండలంలోని గోవిందాపూర్ శివారు ఎర్రచెరువు తండాలోని టేకులమేడారం జాతరకు భక్తులు పెద్ద సంఖ్యలో చేరుకున్నారు. తల్లులను దర్శించుకొని మొక్కులు సమర్పించుకున్నారు.


టేకుల మేడారంలో పట్టువస్త్రాలతో పూజారులు

కొలువుదీరిన సారలమ్మ

- దారిపొడవునా భక్తుల నీరాజనాలు
- గాంధీనగర్‌లో వరాలుపట్టిన భక్తులు
- నేడు సమ్మక్క రాకకు ఏర్పాట్లు

భక్తుల నినాదాలు, జయజయధ్వానాలతో నాగరాజుపల్లి మద్దిమేడారం మార్మోగింది. అడుగడుగునా భక్తుల పూనకాలు, కేరింతలతో గుండ్లపహాడ్ గాంధీనగర్ నుంచి వరాలతల్లి సారలమ్మను మద్దిమేడారంలోని గద్దెపైకి తీసుకొస్తుండగా భక్తులు పొర్లుదండాలు పెట్టారు. ప్రత్యేక పూజల అనంతరం బుధవారం రాత్రి ఆంజనేయస్వామి జెండా నీడలో గుండ్లపహాడ్ శివారు గాంధీనగర్ నుంచి ఒల్లెనర్సయ్యపల్లి, మామిండ్లవీరయ్యపల్లి, పంతులుపల్లి గ్రామాల మీదుగా సారలమ్మను గద్దెపైకి చేరుకునే అపూర్వ సన్నివేశం ఉద్విగ్న భరితంగా సాగింది. గాంధీనగర్‌లోని గుడి నుంచి సారలమ్మ ప్రధాన పూజారి ధర్మపురి సువర్ణ వెదురుబుట్టలో కుంకుమ భరిణి రూపంలో ఉన్న సారలమ్మను తీసుకొని బుధవారం రాత్రి 9 గంటలకు ఆలయం బయటకు రాగానే భక్తులు పరవశించిపోయారు. సారలమ్మ సుమారు 4 కిలోమీటర్ల రోడ్డు మార్గంలో భక్తులు సాష్టాంగ నమస్కారాలతో వరం పట్టారు. అంతకు ముందు గోవిందరాజు, పగిడిద్ద రాజులను గాంధీనగర్ నుంచి తీసుకొచ్చి ప్రతిష్ఠించారు. వేలాదిగా భక్తులు సారలమ్మను దర్శించుకుని మొక్కులు సమర్పించారు.

క్లుప్తంగా

కల్యాణలక్ష్మి చెక్కుల పంపిణీ



గీసుకొండ: మండలంలోని కొనాయమాకుల వద్ద గల రైతువేదికలో పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డి బుధవారం 36 మంది లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులను పంపిణీ చేశారు. ఆయన వెంట ఎంపీపీ బీమగాని సౌజన్య, తహసీల్దార్ రియాజుద్దీన్, ఎంపీడీఓ కృష్ణవేణి, ఎంపీటీసీ రాజబోయిన రజిత, కోఆప్షన్ సభ్యులు ఎండీ రహీం, నాయకులు చాడ కొమురారెడ్డి, తుమ్మనపెల్లి శ్రీనివాస్, రాజబోయిన భిక్షపతి, కొండేటి కొమురారెడ్డి, తదితరులు ఉన్నారు.

ఏసీపీని కలిసిన నాయకులు



నర్సంపేట: ఏసీపీగా బాధ్యతలు స్వీకరించిన కిరణ్‌కుమార్‌ను బుధవారం రాష్ట్ర ఖనిజాభివృద్ధి సంస్థ మాజీ డైరెక్టర్, ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ జిల్లా కమిటీమెంబర్ నాడెం శాంతికుమార్ మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ మేరకు పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. ఏసీపీని కలిసిన వారిలో గుండం శ్రీనివాస్, మోతె రంగారెడ్డి ఉన్నారు.

ఆర్థికసాయం



ఖానాపురం: మండలంలోని కొత్తిమాటుతండాలో బాధిత కుటుంబాన్ని ప్రభుత్వ ఉద్యోగులు బుధవారం పరామర్శించారు. గ్రామానికి చెందిన బానోతు రాందాస్ అనారోగ్యంతో మృతి చెందగా బాధిత కుటుంబానికి గ్రామ ప్రభుత్వ ఉద్యోగులు రూ.20 వేల ఆర్థికసాయం అందజేశారు. పిల్లల విద్యాభివృద్ధికి తమవంతు సహకారం అందిస్తామని భరోసా కల్పించారు. పరామర్శించిన వారిలో ఉద్యోగస్తుల సంఘం గౌరవ అధ్యక్షుడు జాటోతు జేతురాంనాయక్, బన్సీలాల్, రాందాస్, వీరన్న సుధాకర్, దేవ్‌సింగ్, శ్రీనివాస్, ఉపేందర్, విజయ్‌కుమార్, సత్యనారాయణ, సోమేశ్వర్ ఉన్నారు.

సెలవులు ప్రకటించాలి

పర్వతగిరి: ఆసియా ఖండంలోనే అతిపెద్దదైన మేడారం జాతరకు ప్రభుత్వం అధికారికంగా సెలవులు ప్రకటించాలని వడుప్సా (వరంగల్ జిల్లా అన్ ఎయిడెడ్ ప్రైవేట్ స్కూల్స్ అసోసియేషన్) జిల్లా కార్యనిర్వాహక కార్యదర్శి అక్కినపల్లి సతీష్‌కుమార్ బుధవారం ఒక ప్రకటనలో కోరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రెండేళ్లకోసారి జరిగే మహా జాతరకు తెలంగాణ నుండే కాకుండా ఇతర రాష్ట్రాల నుంచి ప్రజలు లక్షలాదిగా తరలివస్తారని తెలిపారు. జాతరకు వెళ్తున్న కారణంగా వారం రోజులుగా విద్యార్థులు పాఠశాలలకు తక్కువ సంఖ్యలో హాజరవుతున్నారన్నారు. సంబంధిత అధికారులు స్పందించి రెండు రోజులు సెలవు ప్రకటించాలని కోరారు.

మాదిగల ఐక్య సంక్షేమ సంఘం కన్వీనర్‌గా భాస్కర్



పర్వతగిరి: మాదిగల ఐక్య సంక్షేమ సంఘం (మాస్) మండల కన్వీనర్‌గా బొట్ల భాస్కర్ నియామకమయ్యాడు. ఈ మేరకు సంఘం వరంగల్ ఉమ్మడి జిల్లా ఇన్‌చార్జ్ సూరారపు నిరంజన్ బుధవారం నియామకపత్రం అందజేశారు. ఈ సందర్భంగా నిరంజన్ మాట్లాడుతూ మండల కేంద్రానికి చెందిన భాస్కర్ మండలంలో అన్ని గ్రామాల్లో మాదిగ సామాజిక వర్గాన్ని పార్టీలకతీతంగా ఒకే వేదిక మీదకు తీసుకొచ్చేలా కృషి చేయాలని సూచించారు.

వీడ్కోలు సమావేశం



గీసుకొండ: ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంటర్ ద్వితీయ సంవత్సర విద్యార్థులకు బుధవారం వీడ్కోలు సమావేశం ఏర్పాటు చేశారు. ప్రథమ సంవత్సర విద్యార్థుల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమంలో సాంస్కృతిక ప్రదర్శనలు పలువురిని అలరించాయి. సమావేశంలో ఇన్‌చార్జ్ ప్రిన్సిపాల్ జి.కుమార్, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ ఎం.మహేందర్, అధ్యాపకులు పాల్గొన్నారు.

ప్రజాస్వామ్యాన్ని కాపాడాలి

నర్సంపేట: యువత, మహిళలు రానున్న ఎన్నికల్లో ప్రధాని మోదీకి ఓటు వేసి ప్రజాస్వామ్యాన్ని కాపాడాలని లీగల్ రైట్స్ కౌన్సిలింగ్ ఆఫ్ ఇండియా జనరల్ సెక్రటరీ మంద రాజ్యలక్ష్మి అన్నారు. దేశ్‌కా వికాస్ మోదీజి కే పాస్ ఔర్ ఏక్ బార్ సర్కార్ అనే నినాదంతో మధురై నుంచి ఢిల్లీ వరకు 21వేల కిలోమీటర్లు చేపట్టిన బైక్‌ర్యాలీ బుధవారం నర్సంపేటకు చేరుకుంది. ఈ సందర్భంగా బీజేపీ యువమోర్చా నియోజకవర్గ కన్వీనర్ జూలూరి మనీష్‌గౌడ్ ఆధ్వర్యంలో రాజ్యలక్ష్మి చేపట్టిన ర్యాలీకి ఘనస్వాగతం పలికారు. కార్యక్రమంలో బీజేపీ పట్టణ అధ్యక్షుడు బాల్నె జగన్, ఎంపీ కాంటెస్ట్ అభ్యర్థి స్వరూప, మహిళా నాయకురాలు శైలవాహిని, మామిడి హైమావతి, ఆడెపు సంధ్యారాణి, పుట్ట కవిత, పంజాల రము, రమేష్‌పాండే, యువమోర్చా పట్టణ అధ్యక్షుడు గూడూరు సందీప్, ప్రధాన కార్యదర్శులు ఠాకూర్ విజయ్‌సింగ్, తదితరులు పాల్గొన్నారు.


బైక్ ర్యాలీకి స్వాగతం పలుకుతున్న బీజేపీ నాయకులు



ఎండలో మాడుతున్న భక్తులు

పరకాల : మేడారం వెళ్లే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు తీసుకుంటున్నామని పాలకులు, అధికారులు చెబుతున్న మాటలు క్షేత్రస్థాయిలో అమలు కావడం లేదనే ఆరోపణలు వ్యక్తమవుతున్నాయి. పట్టణంలో ఏర్పాటు చేసిన బస్టాండ్ల వద్ద చలువ పందిళ్లు, టెంట్లు ఏర్పాటు చేయకపోవడంతో భక్తులు టికెట్ల కోసం ఎండలోనే నిల్చొని ఇబ్బందులు పడ్డారు. చలువ పందిళ్లు వేయాలని భక్తులు కోరుతున్నారు.



ఒలింపియాడ్‌లో సిద్ధార్థ విద్యార్థుల ప్రతిభ


విద్యార్థులను అభినందిస్తున్న చైర్మన్ కంది గోపాల్‌రెడ్డి

చెన్నారావుపేట: ఇటీవల నిర్వహించిన రాష్ట్ర స్థాయి ఎస్ఆర్ఎఫ్ ఒలింపియాడ్ పరీక్షలో సిద్ధార్థ విద్యార్థులు ఉత్తమ ప్రతిభ కనబర్చినట్లు ఆ విద్యాసంస్థల చైర్మన్ కంది గోపాల్‌రెడ్డి అన్నారు. పాఠశాల ఆవరణలో బుధవారం విద్యార్థులను అభినందించిన సందర్భంగా ఆయన మాట్లాడుతూ 7వ తరగతి గణితంలో పి.శశాంక్ రాష్ట్రస్థాయి 4వ ర్యాంక్, ఎస్.అక్షయ 8వ తరగతి గణితంలో ద్వితీయ ర్యాంకు, ఏ.అనీష్ 8వ తరగతి సైన్స్‌లో ద్వితీయ ర్యాంకు, కన్సోలేషన్ బహుమతుల్లో రామ్‌చరణ్ 10లో, ఎం.తరుణ్ 9లో, పి.వైశాలి 7లో, జి.హర్షవర్ధన్ 5లో కె.కిషోర్ 4లో ఉత్తమ ప్రతిభ కనబర్చినట్లు వెల్లడించారు. ఈ నెల 19న హైదరాబాద్‌లోని రవీంద్రభారతిలో జరిగిన కార్యక్రమంలో జయప్రకాశ్‌నారాయణ, నిట్ డైరెక్టర్, ఐటీ కమిషనర్ జీవన్‌లాల్ చేతుల మీదుగా అవార్డులు అందుకున్నట్లు చెప్పారు. హెచ్ఎం కర్ణాకర్‌రెడ్డి, ఎస్ఆర్ఎఫ్ కోఆర్డినేటర్ వేణు, విద్యార్థులను అభినందించారు.

యువకుడికి తీవ్రగాయాలు

ఖానాపురం: వరిపంటకు మందు పిచికారి చేసే క్రమంలో ప్రమాదవశాత్తు డ్రోన్ తగిలి యువకుడికి తీవ్ర గాయాలైన సంఘటన ఖానాపురంలో చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన ప్రకారం..మండలంలోని పెద్దమ్మగడ్డ గ్రామానికి చెందిన కొమ్మిడి నర్సిరెడ్డి తన పంటలో మందు పిచికారి చేయడానికి డ్రోన్‌ను తీసుకెళ్లాడు. పిచికారి చేస్తుండగా డ్రోన్ కిందపడిపోయింది. దీంతో ఆపరేటింగ్ చేస్తున్న నర్సిరెడ్డి పైకి తీసి ఆన్ చేయడంతో అకస్మాత్తుగా యువకుడి కాలుపై పడటంతో తీవ్ర గాయాలయ్యాయి. గమనించిన రైతులు వెంటనే చికిత్స నిమిత్తం నర్సంపేటకు తరలించారు. అనంతరం అక్కడి నుంచి వరంగల్‌కు తరలించారు.

రిజర్వేషన్ సాధనకు ఐక్య కార్యాచరణ


కాంగ్రెస్ నేత నీల మధుతో పులి దేవేందర్

చెన్నారావుపేట: ముదిరాజ్ రిజర్వేషన్ సాధనకై ఐక్య కార్యాచరణ రూపొందిస్తామని కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు నీలం మధు ముదిరాజ్, మెపా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పులి దేవేందర్ ముదిరాజ్‌లు తెలిపారు. ఈ మేరకు హైదరాబాద్‌లోని పటాన్‌చెరువులోని నివాసంలో చిట్కోల్‌లో నీలం మధును మెపా రాష్ట్ర కమిటీ సభ్యులు బుధవారం ఆయనను కలిశారు. ఈ సందర్భంగా నీలం మధు మాట్లాడారు. ఈ సమావేశంలో నాయకులు చిరుత వెంకటేశ్వర్లు, నీరటి రాజు, అశోక్, రాఘవేంద్ర, శేఖర్, మహేందర్, రమేష్, శ్యామ్, నాయకులు ఉన్నారు.

సేవలను సద్వినియోగం చేసుకోవాలి


మహిళలకు చీరెలు పంపిణీ చేస్తున్న కాంగ్రెస్ నాయకులు

రాయపర్తి: హనుమాండ్ల ఝాన్సీరాజేందర్‌రెడ్డి ట్రస్ట్ ఆధ్వర్యంలో ప్రజలకోసం చేసే సేవలను సద్వినియోగం చేసుకోవాలని తొర్రూరు బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు జాటోతు హమ్యానాయక్ అన్నారు. బుధవారం మండలంలోని బందనపల్లిలో ట్రస్ట్ ఆధ్వర్యంలో నియోజకవర్గ మహిళలకు అందిస్తున్న చీరెల పంపిణీ కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ పాలకుర్తి ఎమ్మెల్యే యశస్వినిరెడ్డి ఆదేశాల మేరకు గ్రామాల్లో మహిళలకు చీరెలను పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ కొడగాని ఉమాయాదగిరి, కాంగ్రెస్ గ్రామ అధ్యక్షుడు బాసాని కిషన్, కుసుంబ రవి, కొడగాని రమేష్, లడే హరిత, నాగరాజు, చాంద్‌పాషా పాల్గొన్నారు.

సొసైటీ మాజీ చైర్మన్ సాంబరెడ్డికి ఘననివాళి

నర్సంపేట: సొసైటీ మాజీ చైర్మన్ రాధారపు సాంబరెడ్డి ప్రథమ వర్ధంతి సభ రెడ్డి సంక్షేమ సంఘం అధ్యక్షుడు కంది గోపాల్‌రెడ్డి అధ్యక్షతన బుధవారం పట్టణంలోని రెడ్డి ఫంక్షన్‌హాల్‌లో నిర్వహించారు. రోటరీ క్లబ్, రెడ్డి సంఘం మిత్ర బృందం సంయుక్తంగా నిర్వహించిన సాంబరెడ్డి వర్ధంతి సభకు ముఖ్య అతిథిగా రెడ్డి సంఘం రాష్ట్ర అధ్యక్షుడు గోపు జైపాల్‌రెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా సాంబరెడ్డి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ సాంబరెడ్డి సేవా దృక్పథం కలవాడని, చెన్నారావుపేట సహకార సంఘానికి కార్యదర్శి, అధ్యక్షుడిగా ఉండి సంఘ అభివృద్ధికి కృషి చేశారన్నారు. సహకార సంఘంలో నిర్మాణం చేయబోయే ఏసీ ఫంక్షన్ హాల్‌కు సాంబరెడ్డి పేరు పెట్టాలని సూచించారు. వర్ధంతి సభలో ఎర్ర యాకుబ్‌రెడ్డి, నామాల సత్యనారాయణ, సొసైటీ అధ్యక్షుడు సత్యనారాయణరెడ్డి, యాకుబ్‌నాయక్, రోటరీ క్లబ్ సేవకులు కోటేశ్వర్‌రావు, రంజిత్‌కుమార్, పవన్‌కుమార్, జయపాల్‌రెడ్డి, యాకిరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.


నర్సంపేట : మాట్లాడుతున్న జైపాల్‌రెడ్డి

చెన్నారావుపేట: సాంబరెడ్డి ప్రథమ వర్ధంతి వేడుకలు బుధవారం మండల కేంద్రంలో జరిగాయి. ఆయన చిత్రపటానికి సొసైటీ చైర్మన్ ముద్దసాని సత్యనారాయణరెడ్డి పూలమాల వేసి నివాళులర్పించారు. ఆయన వెంట డైరెక్టర్లు జంగిలి రాజు, మజ్జిగ రాంబాబు, మహ్మద్ బషీర్, ఇస్లావత్ గోపి, జున్నుతుల మహేందర్‌రెడ్డి, సీఈవో చిట్టి రవి ఉన్నారు.

విద్యుత్ షాక్‌తో రైతు మృతి


- మరో ముగ్గురికి గాయాలు


సంజీవ (ఫైల్)

ఖానాపురం: విద్యుత్ షాక్‌తో ఓ రైతు మృతి చెందగా మరో ముగ్గురికి గాయాలైన సంఘటన మండలంలోని బుధరావుపేటలో బుధవారం చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. బుధరావుపేటకు చెందిన అనపర్తి సంజీవ(50) గ్రామశివారులోని కొత్తబోడు వద్ద మొక్కజొన్న పంటసాగు చేయగా విద్యుత్ మోటారు ద్వారా నీరు పారిస్తున్నారు. కింద వేలాడుతూ ప్రమాదకరంగా ఉన్న తీగలను సరి చేసేందుకు మరో ఇరువురు రైతులు ఉప్పలయ్య, మహేష్‌లు కలిసి హెల్పర్ ప్రశాంత్‌ను తీసుకుని విద్యుత్ తీగల వద్దకు వెళ్లారు. విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌లో విద్యుత్ సరఫరాను నిలిపేసి హెల్పర్ ప్రశాంత్ విద్యుత్ స్తంభంపై ఉండగా కింద సంజీవ, ఉప్పలయ్య, మహేష్‌లు తీగలను లాగుతూ సరిచేస్తున్నారు. ఈ క్రమంలో ప్రమాదవశాత్తు 11 కేవీ విద్యుత్ తీగలకు తగలడంతో తీవ్ర గాయాలయ్యాయి. స్తంభంపై ఉన్న ప్రశాంత్‌కు షాక్ తగిలి కిందపడిపోగా కింద ఉన్న ఇరువురు రైతులు స్పృహ తప్పి పడిపోయారు. ఇది గమనించిన సమీప రైతులు నర్సంపేట ఏరియా ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో సంజీవ మృతి చెందాడు. విషయం తెలుసుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు. బాధిత కుటుంబాన్ని ఎంపీపీ వేములపల్లి ప్రకాశ్‌రావు, మాజీ సర్పంచ్ కాస ప్రవీణ్‌కుమార్ పరామర్శించారు. మృతుడికి భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు.

బాధిత కుటుంబాలకు పరామర్శ

నర్సంపేట రూరల్ : మండలంలోని రాజుపేటకు చెందిన తండా వెంకన్న ఇటీవల అనారోగ్యంతో మృతిచెందాడు. ఆయన కుటుంబాన్ని పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డి పరామర్శించారు. ఆయన వెంట కాంగ్రెస్ నాయకులు కొత్త శ్రీనివాస్, దూపటి ఆనంద్, తండా దిలీప్, భూసాని సుదర్శన్, బత్తిని రవీందర్, తదితరులు ఉన్నారు.


నెక్కొండ: పుల్లయ్య చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న నర్సంపేట ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి

నెక్కొండ: మండలంలోని నాగారం గ్రామానికి చెందిన సీనియర్ కాంగ్రెస్ నాయకుడు తూము పుల్లయ్య ఇటీవల అనారోగ్యంతో మృతి చెందాడు. బుధవారం నర్సంపేట ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి పుల్లయ్య దశదిన కార్యక్రమానికి హాజరై నివాళులర్పించారు. అనంతరం మృతుడి కుటుంబ సభ్యులను ఎమ్మెల్యే పరామర్శించారు. ఎమ్మెల్యే వెంట టీపీసీసీ సభ్యుడు సొంటిరెడ్డి రంజిత్‌రెడ్డి, మండల అధ్యక్షుడు బక్కి అశోక్, నాయకులు కుసుమ చెన్నకేశవులు, కొమ్మారెడ్డి సుధాకర్‌రెడ్డి, కేవీ.సుబ్బారెడ్డి, గైని లక్ష్మణ్, శ్రీనివాస్, శివకుమార్, మహిపాల్‌రెడ్డి, రవి, యాదగిరి, తదితరులు ఉన్నారు.

మానవత్వాన్ని చాటిన ఎమ్మెల్యే

గీసుకొండ: మండలంలోని కొమ్మాల శివారు వరంగల్-నర్సంపేట రహదారిలో బుధవారం మధ్యాహ్నం ఎదురెదురుగా రెండు బైక్‌లు ఢీకొన్నాయి. ఈ ఘటనలో బైక్‌లపై వెళ్తున్న ముగ్గురు తీవ్రంగా గాయపడ్డారు. అదే సమయంలో నర్సంపేట నుంచి వరంగల్‌కు వస్తున్న పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డి గాయపడిన వారిని తన కారుతో పాటు పోలీసుల వాహనంలో తీసుకెళ్లి మచ్చాపూర్ వద్ద అంబులెన్స్ వాహనంలో ఎక్కించి ఆస్పత్రికి తరలించి మానవత్వాన్ని చాటుకున్నారు.